తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
మంగళవారం
18 ఆగష్టు 2026
పేజీలు : 8
Follow :

# పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## ప్రజలకు నమ్మకం కలిగేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్గొండ,ఆగస్టు 17,(జనంసాక్షి) :** ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించి, ప్రజలకు నమ్మకం కలిగేలా అధికారులు బాధ్యతతో, చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సోమవారం నుంచి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమైనందున జిల్లా స్థాయి అధికారులు కూడా మండల స్థాయి ప్రజావాణికి తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు.మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా పెండింగ్‌లో ఉన్నందున వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన దరఖాస్తులను కూడా త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగ్ దరఖాస్తుల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. మండల స్థాయి ప్రజావాణికి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలోనే సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలన్నారు. మండల స్థాయిలో పరిష్కరించాల్సిన దరఖాస్తులు జిల్లా స్థాయికి రాకుండా అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రతి అధికారి ప్రజల సమస్యలను బాధ్యతగా స్వీకరించి చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. మండల స్థాయిలో వచ్చిన దరఖాస్తులపై జిల్లా అధికారులు క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలని, మండల, డివిజన్ స్థాయిల్లో హెచ్‌ఓడీలతో సమీక్షలు నిర్వహించి పెండింగ్ పిటిషన్లను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అధికారి వారానికొకసారి దరఖాస్తుల పరిష్కారంపై సమీక్ష చేసుకోవాలని సూచించారు.మండల స్థాయిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ట్యాబ్ లింక్ ద్వారా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవోలు, తహసీల్దార్లతో మాట్లాడి మండల స్థాయిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు న్యాయం జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేసి, దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చూడాలని స్పష్టం చేశారు. 146 దరఖాస్తులు,ఈ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 146 దరఖాస్తులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 82, ఇతర శాఖలకు సంబంధించినవి 64 దరఖాస్తులు ఉన్నాయి.జిల్లా స్థాయి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె. శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి పీడీ శేఖర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు.



# పేద కుటుంబాలలో ఆందోళన కలిగించవద్దు

## మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 17 (జనంసాక్షి)** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పేద కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోందని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో నాడు కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకాలు వేలాది కుటుంబాలకు ఎంతో ఉపయోగపడ్డాయని గుర్తుచేశారు. హైకోర్టులో ఈ పథకాలపై విచారణ జరుగుతున్న సమయంలో ప్రభుత్వం తగిన విధంగా స్పందించి, పథకాల ప్రయోజనాలు అర్హులైన కుటుంబాలకు అందేలా న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పేద కుటుంబాలు నష్టపోయే పరిస్థితి రావద్దని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేసుకుంటే.. వార్తా లోపలి పేజీలో

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ప్రజావాణి పోర్టల్‌లో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు**

**మండల స్థాయి ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి**

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట (జనంసాక్షి):** ప్రజా సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబందించి 43 దరఖాస్తులు, డిపిఓకు 8,డిడబ్ల్యుఓ 3, డిఎంహెచ్ఓకు 3, మిగిలిన 38 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 95 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఏ పిడి సన్యాసయ్య, డిఈఓ అశోక్, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను పరిరక్షించాలి



**నల్లగొండ, ఆగస్టు 17 (జనం సాక్షి):** తెలంగాణలో ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లే విధానాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ఎదుట ధర్నాలు నిర్వహించి, అనంతరం నల్లగొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వు నంబర్ 97ను రద్దు చేయాలని, పాలిటెక్నిక్ విద్యను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానం లేదా ప్రైవేటీకరణకు అప్పగించరాదని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా నైపుణ్య విశ్వవిద్యాలయంలో విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.పాలిటెక్నిక్ విద్యకు కీలకమైన రాష్ట్ర సాంకేతిక విద్యా మండలిని బలోపేతం చేయాలని, విద్యార్థులకు పార్శ్వ ప్రవేశం ద్వారా ఇంజినీరింగ్‌లో చేరే అవకాశాలను కొనసాగించాలని అన్నారు. కళాశాలల్లో మౌలిక వసతులు, ప్రయోగశాలలు, శిక్షణా వర్క్‌షాప్‌లు, వసతిగృహాలు, అధ్యాపకుల కొరతను పరిష్కరించాలని, ఫీజులు పెంచకుండా చూడాలని కోరారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిస్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.ఏ. సైఫ్, మారుపాక కిరణ్, ఆదిల్, నందివర్ధన్ రాజు, గౌతమ్, శివాత్మిక, జయప్రకాష్, సాయి, సౌమ్య, అక్షయ, కావ్య, బన్ని, సహస్ర, యశశ్వి తదితరులు పాల్గొన్నారు.

# బాధితుల సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు

## జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ ఫిర్యాదు దారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఆయనకు వినతులు సమర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ వారి సమస్యలను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

**మధిర, ఆగస్టు 17 (జనంసాక్షి):** పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో వీలినం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్× ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




స్థానిక మధిర మండలం కాజీపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ మధిర నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.... పాలిటెక్నిక్ విద్య అనేది పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే ఒక ప్రత్యేక వ్యవస్థ అనే ఆయన పేర్కొన్నారు దీనిని శక్తి శాఖలో కలపటం వలన విద్య వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు ప్రభుత్వ కళాశాలలు ప్రైవేట్ పరం అయితే పేద మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో కూడిన డిప్లమా విద్య అందకుండా పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు పేద విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య ప్రభుత్వాలు అందుబాటులో ఉంచాలి గాని పేద విద్యార్థులను మరింత విద్యకు దూరం చేసే కుట్రలకు పూనుకుంటుందనీ ఆయన అన్నారు.పాలిటెక్నిక్ కళాశాలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 97 ను ఉప సవరించుకోవాలన్నారు రాష్ట్రంలో సాంకేతిక విద్యా మండలిని విశ్వవిద్యాలయంగా అప్గ్రేడ్ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో అందుకు మంత్రివర్గం ఉప సంఘం పచ్చ జెండా ఊపింది కొత్తగా కానీ ఆ తర్వాత కొత్తగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు ఐటీ పరిశ్రమలు శాఖ పరిధిలో నడుస్తున్న ఈ యూనివర్సిటీని సాంకేతిక విద్యా శాఖ పరిధిలోకి తెస్తామని ప్రభుత్వం చెప్పినప్పటికీ ఆ దిశగా ముందడుగు పడలేదు తాజాగా ఐటిఐలు ఏటీసీలు పాలిటెక్నిక్ కళాశాల ను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో చేర్చాలని సర్కార్ నిర్వహించింది దీంతో ప్రభుత్వం సాంకేతిక విద్యాశాఖతో ఆటలాడుతుందని ఇలాంటి నిర్ణయాలను వెనుక తీసుకోవాలని ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని, వేలాదిమంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ కళాశాలలో జాయిన్ అవుతే నేడు ప్రభుత్వం తీసుకువచ్చిన నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళన కు గురవుతున్నారని, లక్షలాదిమంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి అధ్యాపకులు భర్తీ, ల్యాబ్ల ఆధునికరణ వర్క్ షాపులు నిర్వహణ హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్ ఆలోచన చేయడం సరికాదని తక్షణమే ఈ ఆలోచనను ఉపసంహరించుకోవాలని లేని ఎడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నాగుల్ మీరా ఏఐఎస్ఎఫ్ మధిర నియోజకవర్గ నాయకులు మణికంఠ పవన్. రితిక్ అశోకు సాయి వెంకట్ హుస్సేన్ మౌనిక శ్వేత రమ్య దివ్య కీర్తన తదితరులు పాల్గొన్నారు..

# బూర్గంపహాడ్‌లో ప్రజావాణికి 24 ఫిర్యాదులు

- అధికారుల సమక్షంలో ప్రజల సమస్యల స్వీకరణ.. సోంపల్లి ముంపుపై ప్రత్యేక వినతి
- ప్రజావాణికి ఆర్అండ్‌బీ, ఐటీడీప శాఖలు గైర్హాజరు..



**బూర్గంపహాడ్ ఆగస్టు 17 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఎంఎస్ నం.4 మేరకు బూర్గంపహాడ్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తొలి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కె. జమలా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. మొత్తం 24 ఫిర్యాదులు అందగా.. రెవెన్యూ 3, పంచాయతీరాజ్ 11, హౌసింగ్ 7, విద్యుత్, ఆర్అండ్‌బీ, వ్యవసాయ శాఖలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు.

**- సోంపల్లి ముంపుపై వినతి**

కిన్నెరసాని బ్యాక్‌వాటర్, వరదల కారణంగా సోంపల్లి గ్రామానికి ముంపు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ముంపు ప్రాంతాల జాబితాలో సోంపల్లిని కూడా చేర్చి ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీవో జమలా రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే వరదల కారణంగా రైతుల భూములు కోతకు గురయ్యాయని, పోలవరం పూర్తయిన అనంతరం ముంపు ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**- విద్యుత్ స్తంభాలు, రోడ్లు, పారిశుధ్యంపై ఫిర్యాదులు**

బూర్గంపహాడ్‌లో పాత ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఉపసర్పంచ్ గుండె వెంకన్న కోరారు. 7వ వార్డులో బోరింగుల మరమ్మతులు, వీధిలైట్లు, సీసీ రోడ్లు, కాలువల్లో పెరిగిన గడ్డిని తొలగించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. మైనార్టీ పాఠశాల సమీపంలో వంగిపోయిన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని, విద్యార్థుల భద్రత దృష్ట్యా వెంటనే తొలగించాలని వార్డు మెంబర్ ఎస్.కె నస్రీన్ కోరారు.మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనానికి తాళం వేసి ఉండటంపై బబ్బు రాయుడు ఫిర్యాదు చేయగా, తాళాలు తొలగించి పరిసరాలను శుభ్రం చేయిస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

ఆర్అండ్‌బీ రోడ్ల ప్రక్కన వాణిజ్య సముదాయాల ఆక్రమణలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని జక్కిరెడ్డి మల్లారెడ్డి ఫిర్యాదు చేసి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**- ప్రజావాణికి ఆర్అండ్‌బీ, ఐటీడీప శాఖలు గైర్హాజరు**

ప్రజల సమస్యలను నేరుగా స్వీకరించి పరిష్కరించేందుకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెండు శాఖలు మాత్రం హాజరు కాలేదు. ఆరంభంలోనే ఆర్అండ్‌బీ, ఐటీడీఏ శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో రోడ్లు, రోడ్ల పక్కన ఆక్రమణలకు సంబంధించిన సమస్యలు ఉండగా, సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంతో వాటిపై తక్షణ స్పందనకు అవకాశం లేకుండా పోయిందని స్థానికులు పేర్కొన్నారు. అలాగే గిరిజన ప్రాంతాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో కీలకమైన ఐటీడీఏ అధికారులు ప్రజావాణికి హాజరు కాకపోవడంపై కూడా పలువురు ప్రశ్నించారు.

ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై, తమ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో జమలా రెడ్డి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

# ఛలో విద్యుత్ సౌధను విజయవంతం చేయండి

## మహా ధర్నా వాల్ పోస్టర్ ను విడుదల చేసిన జేఏసీ నాయకులు..




**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు17 (జనంసాక్షి):** విద్యుత్ ఉద్యోగులకు పి ఆర్ సి ( పే రివిజన్ కమిటీ )అమలు,ఇతర ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టి జి పి ఈ ( తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ ) జె ఏ సి ఆధ్వర్యంలో ఈనెల 19న విద్యుత్ సౌధ (హైదరాబాద్ )ఎదుట మహా ధర్నా జరుగుతుందని ఆ జేఏసీ బీటీపీఎస్ రీజినల్ కన్వీనర్ బి.రవి ప్రసాద్ పేర్కొన్నారు. బీటీపీఎస్ ఎదుట సోమవారం జరిగిన గేట్ మీటింగ్ లో "చలో విద్యుత్ సౌధ" మహా ధర్నా వాల్ పోస్టర్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టి జి పి ఈ ఏ ( తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్) బ్రాంచ్ సెక్రటరీ బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పిఆర్సి తో పాటు వైటిపిఎస్ ప్రైవేటీకరణకు వేసిన టెండర్లను రద్దు చేయాలని తదితర 14 ప్రధాన డిమాండ్లతో ఆందోళన జరుగుతుందని పేర్కొన్నారు. యాజమాన్యం దిగి వచ్చేలా ఈ ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. ( తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ) బ్రాంచ్ సెక్రటరీ నరేష్ మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యమై తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం -1535 రీజనల్ ప్రెసిడెంట్ వి. ప్రసాద్, కార్మిక సంఘం- 1104 నాయకులు వెంకట్రామ్, ఏఐటీయుసీ నాయకులు రమేష్, కార్మిక సంఘ నాయకులు కే.ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాలేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు అశ్వాపురం బీఆర్ఎస్ నాయకుల పయనం..



**అశ్వాపురం ఆగస్టు 17 (జనంసాక్షి):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు అశ్వాపురం మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరారు.కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు, ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతులు, నిర్మాణం, నీటి వినియోగం తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవడమే పర్యటన ఉద్దేశమని నాయకులు తెలిపారు.ఆరోపణలు, రాజకీయ విమర్శల ఆధారంగా కాకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. తెలంగాణ సాగునీటి రంగంపై కాళేశ్వరం ప్రాజెక్టు ప్రభావం, ప్రాజెక్టు ద్వారా గతంలో జరిగిన నీటి వినియోగం, ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలను కూడా పరిశీలిస్తామని తెలిపారు.ప్రాజెక్టు సందర్శన అనంతరం అక్కడి పరిస్థితులను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రాజెక్టుపై జరుగుతున్న రాజకీయ చర్చలో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు.

# అంబేద్కర్ విగ్రహం పునఃస్థాపనకు అనుమతులు ఇవ్వాలి

## కలెక్టర్‌ను కోరిన మాల జన సమితి నాయకులు



**అశ్వాపురం ఆగస్టు 17 (జనంసాక్షి):** మండల కేంద్రంలో తొలగించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని నిబంధనల ప్రకారం తిరిగి అదే ప్రాంతంలో ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ పినపాక నియోజకవర్గ మాల జన సమితి అధ్యక్షుడు చెట్టి సురేష్ ఆధ్వర్యంలో నాయకులు జిల్లా కలెక్టర్ అంకిత్ (ఐఏఎస్)కు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ప్రాంతంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఇటీవల అర్ధరాత్రి సమయంలో ఆర్అండ్‌బీ, సంబంధిత అధికారులు తొలగించారని కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహం తొలగించడం సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని, నిబంధనలకు అనుగుణంగా అనుమతులు ఇచ్చి తిరిగి ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.అదేవిధంగా విగ్రహాన్ని ఏ పరిస్థితుల్లో, ఎవరి ఆదేశాల మేరకు తొలగించారో స్పష్టత ఇవ్వాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పోలీస్, పంచాయతీ శాఖల సమన్వయంతో సమస్యను పరిష్కరించి, వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో కరకపల్లి డేవిడ్, చెట్టి మనోజ్, నాగభూషణం చారి, బండి లక్ష్మయ్య, చెట్టి కమలాకర్, సెనగ వెంకటేశ్వర్లు, భరగడి దేవదానం తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పరుగులు

# మాధాపురంలో మారుతున్న రూపురేఖలు

○పలు పనులకు శ్రీకారం

○విద్య, రహదారులు, డ్రైనేజీ, స్మశానవాటికపై ప్రత్యేక దృష్టి

○పాఠశాలకు నూతన ప్రహరీ నిర్మాణం ప్రారంభం





**ముదిగొండ, ఆగష్టు 15, (జనంసాక్షి) :** నిన్నటి వరకు ఎదురైన సమస్యలు.. నేడు పరిష్కారం దిశగా అడుగులు. గ్రామంలో ఏదో ఒక ప్రాంతంలో అభివృద్ధి పని కొనసాగుతూనే ఉండేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని గ్రామ పెద్దలు, నాయకులు ఉప్పునూరి వెంకటరెడ్డి తెలిపారు. గత రెండు నెలలుగా మాధాపురంలో పలు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల భద్రతకు అవసరమైన నూతన ప్రహరీ నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తాను శక్తిమేరకు కృషి చేస్తున్నానని, అవసరమైతే శక్తికి మించి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

**గుడి... బడి... స్మశానం.. అన్నింటికీ ప్రాధాన్యం**

గ్రామాభివృద్ధిని కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం చేయకుండా ప్రజలకు అవసరమైన ప్రతి అంశంపై దృష్టి సారిస్తున్నామని వెంకటరెడ్డి తెలిపారు. "అభివృద్ధికి గుడి, బడి అని తేడా లేదు. ప్రజలకు అవసరమైన ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందాలి. మనిషి జీవితంలో చివరి మజిలీ అయిన స్మశానవాటిక కూడా గ్రామ మౌలిక సదుపాయాల్లో భాగమే. అందుకే అక్కడ కూడా అవసరమైన వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నాం" అని తెలిపారు.

**పాఠశాలకు ప్రహరీ**

మాధాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన ప్రహరీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. విద్యార్థుల భద్రత, పాఠశాల ప్రాంగణ పరిరక్షణకు ప్రహరీ అవసరమని గుర్తించి ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. విద్యా సంస్థల అభివృద్ధికి కూడా గ్రామంలో ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.

రహదారులకు మరమ్మతులు

గ్రామంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల పరిస్థితిని మెరుగుపరిచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల రోజువారీ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో రహదారుల మరమ్మతులు, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

**డ్రైనేజీ సమస్యకు పరిష్కారం**

వర్షాకాలంలో మురుగునీరు నిలిచిపోవడం, ఇళ్ల మధ్యకు మురుగు చేరడం వంటి సమస్యలు గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులకు కారణమయ్యేవి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కొత్త డ్రైనేజీ లైన్ల ఏర్పాటు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడితే వర్షపు నీరు, మురుగునీటి సమస్యలు చాలావరకు తగ్గే అవకాశం ఉందని, అవసరమైన ప్రాంతాలను గుర్తించి దశలవారీగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**స్మశానవాటికపైనా ప్రత్యేక శ్రద్ధ**

గ్రామాభివృద్ధిలో తరచూ నిర్లక్ష్యానికి గురయ్యే స్మశానవాటికను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. స్మశానవాటికకు వెళ్లే రహదారి అభివృద్ధితో పాటు అక్కడ అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

"ప్రజలకు ఉపయోగపడే ప్రతి పని అభివృద్ధి పనిగానే భావిస్తున్నాం. గ్రామంలో ఎక్కడ సమస్య కనిపించినా దానిని పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తాం" అని వెంకటరెడ్డి తెలిపారు.

**రెండు నెలల్లో...**

**పలు మార్పులు**

గత రెండు నెలలుగా గ్రామంలో వరుసగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఒక పని పూర్తయ్యే వరకు మరో పని కోసం వేచి ఉండకుండా, అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూ వివిధ ప్రాంతాల్లో పనులు కొనసాగించేలా ప్రణాళిక రూపొందించుకున్నామని చెప్పారు. విద్యాసంస్థలు, రహదారులు, డ్రైనేజీ, స్మశానవాటిక వంటి మౌలిక సదుపాయాలపై దృష్టి సారించడంతో గ్రామంలో అభివృద్ధి పనుల సందడి కనిపిస్తోందని స్థానికులు పేర్కొన్నారు.



**"ప్రజలే నా బలం"**

గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు తన ఒక్కరి కృషి ఫలితం కాదని వెంకటరెడ్డి తెలిపారు. గ్రామ ప్రజల సహకారం, నాయకులు, కార్యకర్తల సమన్వయంతోనే పనులు ముందుకు సాగుతున్నాయని చెప్పారు. 'ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభించాం. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. గ్రామంలోని ప్రతి సమస్యను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తాం. అవసరమైన నిధుల కోసం పైస్థాయి నాయకులతో మాట్లాడి మరిన్ని అభివృద్ధి పనులు తీసుకువస్తాం. రాబోయే రోజుల్లో మాధాపురాన్ని మరింత అభివృద్ధి చెందిన గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం" అని వెంకటరెడ్డి తెలిపారు. గ్రామంలో అభివృద్ధి పనులు ఇదే వేగంతో కొనసాగితే రాబోయే రోజుల్లో మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆగస్టు 19న విద్యుత్ ఉద్యోగుల మహా ధర్నా..

### ప్రభుత్వం విద్యుత్ ప్రైవేటీకరణ మానుకోవాలి..



**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 17(జనం సాక్షి):** విద్యుత్ సంస్థల ఉద్యోగులు ఆర్టిజన్ లు ఎదుర్కొంటున్న పలు సమస్యల మీద టి జి పి ఈ జె ఏ సి విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు పలు మార్లు విజ్ఞప్తి చేసినా, ఎటువంటి స్పందన లేదు. వేలాది మంది ఉద్యోగులు రోడ్డుమీదకు వచ్చి తమ నిరసన వ్యక్తం చేస్తున్నా యాజమాన్యాలు స్పందించిన దాఖలాలు లేవు. పి ఆర్ సి వెంటనే నియమించాలని వై టిపిఎస్ లో ని ఏ హెచ్ పి మరియు సిహెచ్ పి ప్రైవేటీ కరణ ప్రతిపాదనలను వెంటనే ఉపసంహ రించుకోవాలని ఆర్టిసన్లు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, 1999 నుండి 2004 మధ్య నియమితులైన ఉద్యోగులకు ఉఖఈ సదుపాయం కల్పించాలని, ఇఖఈ సీలింగ్ ని ఎత్తివేయాలని, రెగ్యులర్ ప్రమోషన్లను కల్పించాలని, అన్ని కేడర్ లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, మరియు ఇతర సమస్యలను పరిష్కరించాలని చాలా కాలంగా టి జి పి ఈ జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో కన్వీనర్ యాస్మిన్ మాట్లాడుతూ ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లోని ఏ హెచ్ పి ( యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ ) మరియు సిహెచ్ పి (కోల్డ హ్యాండ్లింగ్ ప్లాంట్ లను ప్రైవేటీకరించే ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ టి జి పి ఈ జెఏసి ఆధ్వర్యంలో గత 45 రోజులుగా తెలంగాణ విద్యుత్ రంగంలోని ఉద్యోగులు, ఇంజనీర్లు, కార్మికులు మరియు ఆర్టిజన్ లు నిరంతర ఆందోళన కార్యక్రమం చేపట్టామని. ప్రభుత్వ రంగంలోని కీలక విద్యుత్ ఉత్పత్తి సంస్థలను ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్లడం వల్ల ఉద్యోగ భద్రతతో పాటు విద్యుత్ రంగ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని టి జి పి ఈ జె ఎ సి ఆందోళన వ్యక్తం చేస్తుందని తెలిపారు.

ఈ అంశాలపై యాజమాన్యానికి ఇప్పటికే అనేక సందర్భాలలో తమ అభ్యంతరాలను తెలియజేసినప్పటికీ, గత 45 రోజులుగా ఉద్యోగులు శాంతియుతంగా వివిధ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు యాజమాన్యం టి జి పి ఈ జె ఎ సి ప్రతినిధులను చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించే దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యల పై చర్చలకు యాజమాన్యం ముందుకు రాకపోవడంతో, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని జేఏసీ నాయకులు నిర్ణయించారని. ఈ నేపథ్యంలో 2026 ఆగస్టు 19న హైదరాబాద్ విద్యుత్ సౌధ వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు టి జిపిఈఏజేఏసీ ప్రకటించింది. ఈ ధర్నాలో టీ ఎస్ ఎస్ జెన్కో, టిఎస్ ట్రాన్స్కో, టి జి ఎన్ పి డి సి ఎల్ ,టి జి ఎస్ పి డి సి ఎల్ , , తదితర విద్యుత్ సంస్థలకు చెందిన అన్ని గుర్తింపు పొందిన యూనియన్లు, అసోసియేషన్లు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మరియు వేలాది మంది ఉద్యోగులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ మహా ధర్నా కి కే టి పి ఎస్ కాంప్లెక్స్ నుంచి భారీగా నాయకులు మరియు ఉద్యోగులు తరలి వెళ్లడానికి సిద్ధం అవుతున్నారని. సుమారు 500 మందికి పైచిలుకు ఉద్యోగులు వెళ్ళడానికి సన్నాహాలు చేస్తున్నట్లు-టి జి పి ఈ జె ఎ సి కే టి పి ఎస్ వారు తెలిపారూ.

గత 45 రోజులుగా ఉద్యోగులు వర్షం, ఎండను లెక్కచేయకుండా శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సమస్యను పరిష్కరించేందుకు యాజమాన్యం చర్చలకు పిలుస్తుందని ఉద్యోగులు ఆశించారు. కానీ ఇప్పటివరకు ఎటువంటి చర్చలకు పిలుపు రాలేదు. అందువల్ల ఆగస్టు 19న విద్యుత్ సౌధ వద్ద నిర్వహించే భారీ ధర్నా ద్వారా మా డిమాండ్లను మరింత బలంగా తెలియజేస్తాం అని అన్నారు. ఈ సమావేశంలో చైర్మన్ కే రాజేందర్, డోలి శ్రీను, ఇంజనీర్లు బ్రహ్మాజీ, 15 35 యూనియన్ నాయకులు, అన్ని యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# 14 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిరుపేదలకు కేటాయించాలి

**అశ్వాపురం, ఆగస్టు 17 (జనంసాక్షి):** అమెర్ధ గ్రామపంచాయతీలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మిగిలి ఉన్న 14 ఇళ్లను ఇల్లు, ఇంటి స్థలం లేని నిరుపేదలకు కేటాయించాలని కోరుతూ అమెర్ధ ఉపసర్పంచ్ మేకల అంజిబాబు ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. అశ్వాపురం మండల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అధికారులకు వినతిపత్రం అందజేశారు. అమెర్ధ పంచాయతీలో మొత్తం 40 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించగా, ఇప్పటికే 26 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి పట్టాలు అందజేశారని తెలిపారు. అయితే మరో 14 ఇళ్లు ఇంకా కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. మిగిలిన ఇళ్లను రాజకీయాలు, ఇతర ప్రాధాన్యతలకు తావులేకుండా పారదర్శకంగా పరిశీలించి, ఇల్లు, ఇంటి స్థలం లేని పేద కుటుంబాలను గుర్తించాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన నిరుపేదలను గుర్తించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. నిజమైన అర్హత ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక జరిగితే ప్రభుత్వ సంక్షేమ పథకం లక్ష్యం నెరవేరడంతో పాటు, సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు భరోసా కలుగుతుందని అంజిబాబు పేర్కొన్నారు.



# సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**హుజూర్ నగర్, ఆగస్టు 17 (జనంసాక్షి):**
జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపిఎస్ ఆదేశాల మేరకు హుజూర్ నగర్ సిఐ చరమందరాజు ఆధ్వర్యంలో ఎస్సై చలిగంటి నరేష్ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గంజాయి డ్రగ్స్, మత్తు మందులపై, ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపైన, షీ టీమ్స్ పైన పోలీసు కళాభృందంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్సై చలిగంటి నరేష్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై,రోడ్డు నియమ నిబంధనలపై, గంజాయి మత్తు పదార్థాలపై, షీ టీమ్స్ పై పటిష్టంగా పనిచేస్తున్నమని తెలిపారు. చదువుకునే విద్యార్థులు ఇంటర్నెట్ ను సద్వినియోగం చేసుకోవాలి, సైబర్ మోసాలకు గురి కావద్దు, బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డ్ వివరాలు, ఓటిపి వివరాలు ఇతరులకు తెలపవద్దు. ఇతరులు ఆశ చూపితే వాటికి ఆకర్షితులు కావొద్దు. మెసేజ్ లలో వచ్చే బ్లూ లింక్ అనుసరించి వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు అని కోరారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్ కు పిర్యాదు చేయాలని అన్నారు. అలాగే వేధింపులపై 112 కు సమా చారం ఇవ్వాలని తెలిపారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నెంబర్లు, సోషల్ మీడియాలో బహిర్గతం చేయొద్దన్నారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దు అన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల హెడ్ మాస్టర్ మహబూబ్ జానీ, పోలీస్ కానిస్టేబుల్ జానిమియా, మహేష్, మహిళా కానిస్టేబుల్ అనూష, హోంగార్డ్ కాశయ్య, పోలీస్ కళా బృందం ఇంచార్జి యల్లయ్య, సభ్యులు గోపయ్య, సత్యం, చారి, కృష్ణ, నాగార్జున, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.





## వినియోగదారుల మన్ననలు పొందాలి

**సూర్యాపేట(జనంసాక్షి):**
వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు.ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని బాలాజీ గ్రాండ్ హోటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రీన్‌ల్యాండ్ రెస్టారెంట్ అండ్ బ్యాంకెట్స్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించి వారి ఆదరణ పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ షఫీ ఉల్లా, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కౌన్సిలర్ షేక్ మన్సూర్ బీ ఫారుక్, నాయకులు మొరిశెట్టి లక్షాధి, సతీష్, రాచకొండ శ్రీనివాస్, వెన్న జవహర్ రెడ్డి, జూలకంటి నాగరాజు, నాయకులు, కె.రఘువీర్ రెడ్డి, వెన్న వికాస్ రెడ్డి, జవహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాటపల్లిలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన ఎస్ఐ కుమారస్వామి యాదవ్**

**మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**



**మోటకొండూరు, ఆగస్ట్ 17(జనం సాక్షి):**
రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా కాటపల్లి ప్రధాన రహదారిపై పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలతో పాటు ప్రత్యేకంగా 'డ్రంక్ అండ్ డ్రైవ్' (మద్యం సేవించి వాహనాలు నడపడం) తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర ఆటోలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కుమారస్వామి యాదవ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, ప్రయాణ సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ తదితర ధ్రువపత్రాలను తప్పనిసరిగా తమ వెంట ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై మద్యం సేవించి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని, వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిగ్ బాస్ అగ్నిపరీక్షలో టాప్ 15కు ఝాన్సీ ఎంపిక కావడం పట్ల హర్షం

**సూర్యాపేట (జనంసాక్షి):**



సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం కోమటికుంటకు చెందిన తన శిష్యురాలు గుండెబోయిన ఝాన్సీ వ్యవసాయ కుటుంబం నుంచి బిగ్ బాస్ అగ్నిపరీక్షలో టాప్ 15లో చోటు దక్కించుకోవడం పట్ల పట్టణానికి చెందిన సోషల్ టీచర్ ఆరాల రమేష్ యాదవ్ సోమవారం హర్షం వ్యక్తం చేశారు.జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో ఝాన్సీ విద్యను అభ్యసించిందని,ఆ సమయం నుంచే పాటలపై ఆసక్తితో గుర్తింపు తెచ్చుకుందని అన్నారు.తన ప్రతిభతో పాటలపై ఆసక్తితో సింగర్ గా, బుల్లితెర స్థాయికి ఎదగటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

## అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కావాలి

**ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కోలా ఉదయభానుఉపేందర్**

**హుజుర్ నగర్, ఆగస్టు 17 (జనంసాక్షి) :**



అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని గోవిందపురం 8వ వార్డు కౌన్సిలర్ కోల ఉదయభానుఉపేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని గోవిందాపురం 8వ వార్డులో మంత్రి ఉత్తమ్, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్ సహకారంతో మంజూరు చేసిన మంచినీటి బోరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉదయభాను మాట్లాడుతూ గోవిందపురంలో అభివృద్ధి పనులకు మంత్రి ఉత్తమ్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. త్వరలోనే సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పనులు చేపడతామని అన్నారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోటు ఉపేందర్, గొట్టిముక్కల రాములు, పాలడుగు రాజు, బండి భాస్కర్, గొర్రె వీరబాబు, డి ఉదయ్ పాల్గొన్నారు.



## జనగాం వాచ్య తండ బి.టి. రోడ్డు పనులు ప్రారంభం

**సంస్థాన్ నారాయణపురం. ఆగస్టు 17. ( జనం సాక్షి ):**
మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో జనగాం గ్రామం నుండి వాచ్య తండ వరకు నిర్మించిన 3.5 కిలోమీటర్ల నూతన బి.టి. రోడ్డును సోమవారం జనగాం గ్రామ సర్పంచ్ లోడే రఘు గౌడ్ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి చొరవతోనే ఈ రోడ్డు నిర్మాణం సాధ్యమైందని,దీనివల్ల గ్రామ ప్రజలకు,తండ ప్రజల దశాబ్దాల రవాణా కష్టాలు తీరాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో వాచ్య తండ సర్పంచ్ వాకుడోత్ సుధాకర్ ,గ్రామశాఖ అధ్యక్షులు గడ్డం రవి,ఉపసర్పంచ్ ఎర్ర సుశీల లక్ష్మయ్య,సెక్రెటరీ కొర్ర కిషన్,వార్డు మెంబెర్ చుక్క అశోక్,మాజీ సర్పంచ్ గడ్డం శంకరయ్య,మాజీ గ్రామశాఖ అధ్యక్షులు గడ్డం యాదగిరి,మాజీ ఎంపీటీసీ బెల్లంకొండ శంకరయ్య,మంచాల జంగయ్య,బిచ్చానాయక్,గ్రామ శాఖ అధ్యక్షులు గోసుకొండ చంద్రయ్య,యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు చుక్క సైదులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు,గ్రామ ప్రజలు, తదితరులు,పాల్గొన్నారు..



## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**హుజూర్ గర్ రూరల్, ఆగస్టు 17 (జనంసాక్షి):**
గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీలం శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పోసనబోయిన హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హుజూర్ నగర్ తెలంగాణ గ్రామ పంచాయతి కార్మికుల వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో సుమంత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీలం శీను మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పెండింగ్లో ఉన్న వేతనాలను విడుదల చేయాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరిస్తామని వారిని పర్మినెంట్ చేస్తామని కనీస వేతన నిర్ణయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిన వాటిని తుంగలో తొక్కి కార్మికులను ఇబ్బంది గురి చేస్తుందని వెంటనే ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 18, 19 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహించడం జరుగుతుందని ఈ సార్వత్రిక సమ్మెలో కార్మికులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్, యూనియన్ మండల అధ్యక్షుడు షేక్ అస్సాన్ మియా, సురభి వెంకటేశ్వర్లు, వెంకట్ రెడ్డి, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలలో ఆందోళన కలిగించవద్దు

**మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు**

కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం ఆ హామీ అమలుపై స్పష్టత లేకుండా పోయిందని నామ విమర్శించారు. పేదల పెళ్లిళ్ల విషయంలో రాజకీయాలకు అతీతంగా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సాయం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని నామ డిమాండ్ చేశారు. ఈ పథకాల అమలుపై నెలకొన్న అనిశ్చితికి తెరదించి, పేద కుటుంబాలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని స్పష్టం చేశారు.



## సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన

చిట్యాల, ఆగస్టు 17 ( జనం సాక్షి):

జర్నలిస్ట్ యూనియన్ అయిన "టి యు డబ్ల్యూ జె హెచ్-143" సభ్యత్వ నమోదుకు అనూష స్పందన లభిస్తుందని టీయూడబ్ల్యూజే హెచ్-143 నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కొమ్ము యాదగిరి, శిరిసు రమేష్ అన్నారు. చిట్యాల లో సోమవారం టీయూడబ్ల్యూజే హెచ్-143 యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జర్నలిస్టులకు యాదగిరి, రమేష్ లు సభ్యత్వాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం లో టి యు డబ్ల్యు జే హెచ్ -143 ముందంజలో ఉంటుందని, వారి అభ్యున్నతికీ పాటుపడుతుందన్నారు. మండలంలో సభ్యత్వాలను జర్నలిస్టు ఉత్సాహంగా తీసుకున్నారని తెలిపారు. నమోదు పూర్తయ్యాక నియోజకవర్గ స్థాయి సమావేశం జరుగునున్నదన్నారు. టి యు డబ్ల్యు జే హెచ్ -143 చిట్యాల మండలం అధ్యక్షుడు రేగొండ వేణుమాధవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బుస శ్రీనివాస్ కార్యదర్శి మూడ వేణు, నియోజకవర్గ అధ్యక్షుడు కొల్లు శ్రీకాంత్, యూనియన్ ప్రధాన కార్యదర్శి చెన్నోజు చంద్రశేఖర్, కార్యదర్శి మూడ వెంకటాద్రి, నాయకుడు జిట్ట నరేష్, మాజీ అధ్యక్షుడు కారంపూడి మధు, గుండ్లపల్లి వెంకన్న, దేశగొని సాయికుమార్, అంతటి నాగరాజు గౌడ్, పల్లపు ప్రశాంత్, కొమిడాల మహేందర్ రెడ్డి, పెద్ద బోయిన ఆనంద్ కుమార్, ఎడపాక శంకర్ మందడి వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బత్తిని ఉప్పలయ్య గౌడ్ కి సన్మానం

**ఆత్మకూరు (ఎం) జనం సాక్షి ఆగస్టు (17)**



యాదాద్రి జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీలో ఆత్మకూరు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్ ని నియమించడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు... ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందడి అనంత రెడ్డి, ఖంఅూ చైర్మన్ యాస లక్ష్మారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దసాని సిద్ధులు, ప్రధాన కార్యదర్శి జన్నాయికోడె నగేష్, బీసీ సెల్ అధ్యక్షులు చెరుకు శ్రీనివాస్ గౌడ్, కొరటికల్ ఉప సర్పంచ్ మామిడి నర్సిరెడ్డి, ఖంఅూ డైరెక్టర్ పోతగాని మల్లేష్ మండల నాయకులు తండ శ్రీశైలం, కట్టేకోల హనుమంతు, పల్లెపహాడ్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ఎగ్గిడి యాదగిరి, సోషల్ మీడియా కన్వీనర్ ఎలగందుల మహేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిత్తర్ల అనిల్, ఔూజఎ జిల్లా ప్రధాన కార్యదర్శి తొండల అనిల్ కుమార్ గౌడ్, ఔూజఎ మండల అధ్యక్షులు యాస సుభాష్, పట్టణ అధ్యక్షులు లోడి మహేష్ ,పల్లెపహాడ్ బూత్ ఏజెంట్ దాసరి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి ఎంపీడీవో సునీత

**నూతనకల్ ఆగస్టు 17( జనంసాక్షి)**




మండల స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి ఉంటుందని ప్రజావాణి నోడల్ ఆఫీసర్ ఎంపీడీవో సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని వివిధ లైన్ డిపార్ట్మెంట్ అధికారులు ప్రతి సోమవారం ఉదయం10 గంటలకు హాజరవుతారని ఏ శాఖకు సంబంధించిన సమస్యను అయినా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగించుకోవాలని వారు కోరారు. ఎలాంటి సమస్య ఉన్న మండల స్థాయిలోనే పరిష్కరించుకునే విధంగా ప్రతి దరఖాస్తుదారునికి ఆన్లైన్ రసీదు ఇవ్వడం జరుగుతుంది. ఈ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కీ అందరు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణికి సంబందించి వచ్చిన దరఖాస్తులు 4 కూడా రెవిన్యూ శాఖకు సంబందించినవి రావటం జరిగింది. వాటిని సంబంధిత శాఖకు బదిలీ చేశాం. పిటిషనర్స్ కీ ఆన్లైన్ రసీదు కూడా ఇవ్వటం జరిగింది. ఈకార్యక్రమాన్ని పరిశీలించడానికి మండల ప్రత్యేక అధికారి ఎంఏ భారతి వచ్చి పరిశీలించారు. దరఖాస్తులు రాయలేని వారికీ హెల్ప్ డెస్క్ కల్పించాము, హెల్త్ డెస్క్, మంచినీటి సదుపాయాలు తదితర ఏర్పాట్లు కూడా చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పి శ్రీనివాసరావు మరియు సంబంధిత మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## దేవాలయాల చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

○మండలం లో ని దేవాలయాల్లో గంటలు చోరీ

○పరారీలో మరో నిందితుడు



**ఆత్మకూర్ (ఎం) జనం సాక్షి ఆగస్టు (17)**

గత కొద్దీ రోజులు గా ఆత్మకూర్, మూటకొండూరు, గుండాల, వలిగొండ, మండలాల లో ని దేవాలయ లో ని పూజ సామాగ్రి, గంటలు దొంగతనం కేసు ల ను ఆత్మకూర్ (ఎం) పోలీస్ లు చేదించారు. ఈ కేసు లో ఇద్దురు నిందితులు ఉండగా ఒక్కరిని పట్టుకున్నారు. సోమవారం రోజున ఆత్మకూర్ మండలం లో ని తిమ్మాపురం లీ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా నెంబర్ ప్లేట్ లేని టీవీఎస్ లీశ్రీ వాహనాన్ని పోలీసులు ఆపారు. విచారణ లో భాగంగా ఒక్క నిందితుని అదుపులో కి తీసుకోగా వివిధ మండలాలలో అనేక ఆలయాలు చోరీ చేసానని ఒప్పుకున్నాడు.

**నిందితుడు నుంచి స్వాధీనం చేసుకున్న డబ్బులు మరియు దేవాలయ సామాగ్రి**

నిందితుడి నుంచి 11,200 రూపాయలు, మరియు పెద్ద ఆలయ గంటలు 2, మధ్య తరహా గంటలు 5, శతగోపాలు, హారితి పళ్లెం, కలశాలు, లోహపు పాత్రలు, మరియు నాణెలు మరియు నోట్లు వున్న చిన్న సంచి 1,248/-, చిన్న బంగారు ముక్క పుడక మరియు ఇతర సామాగ్రి

**దొంగతనానికి ఉపయోగించిన పరికరాలు**

స్పానర్లు -2, స్క్రూ డ్రైవర్లు -2, ఇనుప కడ్డీ 1.

**నిందితుల యొక్క వివరాలు**

బండారు దుర్గ ప్రసాద్ S/o జంగయ్య అలియాస్ రవీందర్ చౌటుప్పల్

**పరారీలో మరో నిందితుడు**

బండారు సాయి S/o శ్రీను చౌటుప్పల్ పరారీలో ఉన్నాడు. అనుమానస్పదంగా కనిపిస్తే పోలీస్ వారికి తెలపండి ఆత్మకూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ

స్వాధీనం చేసుకున్న ఆలయ వస్తువులను సంబంధిత ఆలయాలు మరియు కేసులతో అనుసంధానించడానికి కూడా చర్యలు చేపట్టారు. అప్రమత్తంగా ఉండాలని, ఆలయాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని మరియు అనుమానాస్పద కార్యకలాపాలు ఏవైనా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు మరియు ఆలయ నిర్వహణ కమిటీలకు పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చోరీ కేసు లో ని నిందితులను పట్టుకోవడం యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్ నాయకత్వం చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి మార్గదర్శకత్వం లో మరియు రామన్నపేట ఇన్స్పెక్టర్ రవి పర్యవేక్షణ నిర్వహించడం జరిగింది.

## ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారం..




### అర్వపల్లి లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు అందజేస్తున్న సర్పంచ్ విద్యాసాగర్

జాజిరెడ్డిగూడెం (జనంసాక్షి):

ప్రజావాణి కార్యక్రమం ద్వారా మండలంలోని సమస్యలను పరిష్కరించుకోవాలని ఎంపీడీవో పల్లపు ఝాన్సీ, తహసిల్దార్ భాషపాక. శ్రీకాంత్ కోరారు. మండల పరిషత్ లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. అర్వపల్లిలో దేవాలయ పట్టా భూముల్లో ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని, పశు వైద్యశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, చేయూత పింఛన్ ల సైట్ నందు వస్తున్న అభయ హస్తం ఫించన్ ల ట్యాగ్ ను తొలగించాలని మండల కేంద్రంలో ఎస్బిఐ ఎటిఎం , బ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని పలు సమస్యలపై దరఖాస్తులు చేశారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన మండల అధికారులు, వైద్యాధికారులు గణేష్, ఎంఈఓ బాల నాయక్, కుమారస్వామి, రాంబాబు సిద్దార్థ , రంగారావు, సతీష్, పూజ శ్రీ, డాక్టర్ నగేష్, అనిల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అనాజీపురం చౌరస్తా వద్ద రోడ్డు ప్రమాదం.. వ్యక్తికి తీవ్ర గాయాలు

**మోత్కూరు ఆగస్టు 17 (జనంసాక్షి)**

మోత్కూర్ పట్టణానికి కిరాణా సామగ్రి కొనుగోలు చేసుకుని స్వగ్రామానికి తిరిగి వెళ్తున్న వ్యక్తిని టి జి 04టి 8541 గల కారు ఢీకొట్టడంతో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటన మోత్కూర్ మండలంలోని అనాజీపురం చౌరస్తా వద్ద సోమవారం చోటుచేసుకుంది.

ప్రమాదంలో శాలిగౌరారం మండలం ఎన్జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన మురారిశెట్టి చంద్రయ్య తీవ్రంగా గాయపడ్డారు. మోత్కూర్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, ఖమ్మం వైపు నుంచి వస్తున్న కారు అనాజీపురం చౌరస్తా వద్ద ఆయనను ఢీకొట్టినట్లు సమాచారం.

ప్రమాదంలో గాయపడిన చంద్రయ్యను వెంటనే చికిత్స నిమిత్తం నార్కట్పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.








## తీజ్ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్

**పి.ఏ.పల్లి,ఆగష్టు 18 (జనంసాక్షి )**

వద్య తండా గ్రామంలో నిర్వహించిన తీజ్ ఉత్సవ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు,నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్థానిక ఉపసర్పంచ్ వద్య రఘు నివాసంలో కేతావత్ భీల్యానాయక్ను శాలువాతో సత్కరించి,సంప్రదాయ తలపాగా ధరింపజేసి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా కేతావత్ భీల్యానాయక్ మాట్లాడుతూ తీజ్ పండుగ గిరిజనులు ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకునే పండుగ అని అన్నారు. ప్రకృతి అనుగ్రహం,మేఘాలు,వర్షాలు,పచ్చదనం,పక్షుల రాకతో పాటు గిరిజనుల సామాజిక జీవనం, సంప్రదాయాలు,ఆచార వ్యవహారాలను ప్రతిబింబించేలా తీజ్ పండుగను నిర్వహించుకుంటారని పేర్కొన్నారు.

తీజ్ వేడుకల్లో భాగంగా యువతులు,మహిళలు సంప్రదాయ దుస్తుల్లో నృత్యాలు చేస్తూ పాటలు పాడుతూ ఆనందంగా గడపడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. స్నేహితులు, బంధువులు,గ్రామస్తులు ఒకచోట చేరి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా గిరిజనుల ఐక్యత,సంప్రదాయాలు మరింత బలపడతాయని తెలిపారు. తీజ్ పండుగ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని కేతావత్ భీల్యానాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,స్థానిక నాయకులు,యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ‘ప్రజావాణి’ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన

**పెద్దవూర, ఆగస్టు 17 (జనంసాక్షి)**

పెద్దవూర మండల ప్రజా పరిషత్ (MPP) కార్యాలయం లో సోమవారం నిర్వహించిన మొదటి ‘ప్రజావాణి’ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై మొత్తం 6 దరఖాస్తులు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో తాసిల్దార్ కాసిం నాయక్ ఎంపీడీవో ఉమాదేవి నందికొండ మున్సిపల్ కమిషనర్ కోటేశ్వరరావుతో పాటు వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులందరూ పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు


**నమోదైన దరఖాస్తుల వివరాలు:**

భూ సమస్యలు: అటికం ధనలక్ష్మి (భూమి సమస్య), బోగరి మారయ్య (వంశపారంపర్యంగా రావాల్సిన భూమి పట్టా పాస్ బుక్ ఇప్పించాలంటూ) దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లు: జక్కుల నాగేష్, తగరం శ్రీనయ్య ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం వినతులు సమర్పించారు. వేతన పెంపు కోరుతూ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్న 339 మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఉపాధ్యాయుల గౌరవ వేతనాన్ని కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్ (అఖీ) ఉపాధ్యాయులతో సమానంగా పెంచే ఫైల్‌కు (Govt.Memo.1869/TW. see.I.A1/2024) ఆర్థిక శాఖ ఆమోదం తెలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ నమోదు: దూరపల్లి పున్నయ్య తమ ఇంటి ఖాళీ స్థలాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని దరఖాస్తు అందజేశారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు తెలిపారు. ప్రజావాణిలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.




## ప్రజావాణిలో రైతుల ఫిర్యాదు



### నిత్యం ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న సిద్ధం వెంకటరత్నంపై చర్యలు తీసుకోవాలని

**మేళ్లచెరువు జనంసాక్షి**

నిత్యం ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న సిద్ధం వెంకటరత్నం, అతని అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక యువత ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. గత కొద్దిరోజులుగా సర్వే నెంబర్ 874లో గల 5 ఎకరాల భూమిని జెసిబి తో చదనుచేసి, కంపచెట్లు తొలగించి కొంతమేర భూమికి పెన్సింగ్ వేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే సర్వేనెంబర్ లో గల 18ఎకరాల భూమిని సిద్ధం వెంకటరత్నం గతంలో కబ్జా చేసి జీవో నెంబర్ 59 ద్వారా రెగ్యులరైజ్ చేసుకునే ప్రయత్నం చేయగా ప్రభుత్వం ఆ భూమిని 2020లో స్వాధీనం చేసుకొని పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అప్పటికే ఈ సర్వే నెంబర్ 874లో సిద్ధం వెంకటరత్నం పేరిట అతను బంధువుల పేరిట సుమారు 2 ఎకరాల భూమిని, ఇండ్ల స్థలాల పేరిట జీవో 59ద్వారా రెగ్యులరైజ్ చేసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 1994లో ప్రభుత్వం బీసీ కాలనీలో ఇంటి స్థలం ఇవ్వగా, ఆ భూమిని ఇతరులకు విక్రయించి నిత్యం ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నట్లు ఆరోపించారు. మేళ్లచెరువు రెవిన్యూ సర్వేనెంబర్ 1057లో కూడా ప్రభుత్వ భూమికి దొంగ పట్టాలు సృష్టించి భూమిని విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం వేపల మాదారం రోడ్డులో సర్వే నెంబర్ 874లో గల ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని, ఇట్టి విషయంపై విచారణ జరిపి సిద్ధం వెంకటరత్నంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా ప్రభుత్వ భూమిని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో రేలా నరసింహారావు, ఉప్మారావు, లక్ష్మణ్ పలువురు స్థానికులు ఉన్నారు.

## సజావుగా సాగిన మండల ప్రజావాణి కార్యక్రమం




**బొమ్మలరామారం ఆగస్టు 17 (జనంసాక్షి)**

మండలంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్యామల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సజావుగా సాగింది. ఈ ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీవో నోడల్ ఆఫీసర్గా వ్యవహరించగా మండల తహసిల్దార్ సునీల్ కుమార్ తో పాటు 14 శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం సజావుగా సాగిందని ప్రజావాణి కార్యక్రమం ముగిసే సరికి 10 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖలో 5 రెవెన్యూ శాఖలో 4 అసిస్టెంట్ ఇంజనీరింగ్ (ఆర్డబ్ల్యూఎస్ )శాఖలో 1 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని మండల అన్నారు.

## మేళ్లచెరువు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి

**మేళ్లచెరువు జనం సాక్షి :**

మేళ్లచెరువు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు విన్నవించారు. మొత్తం 10 ఫిర్యాదులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 8 ఫిర్యాదులు, విద్యా శాఖకు 1 ఫిర్యాదు నమోదయ్యాయి. మిగిలిన 1 ఫిర్యాదు ఇతర శాఖలకు సంబంధించినది. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, విద్య, పంచాయతీరాజ్, వ్యవసాయం, ఆరోగ్యం తదితర అన్ని శాఖల అధికారులు పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. అందిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పరిష్కార నిమిత్తం అప్పగించారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రజావాణి వేదికగా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.



## ప్రతీ ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదగిరిగుట్ట ఆగస్టు 17 (జనంసాక్షి)**

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని మైలారుగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శివాలయం, హనుమాన్ దేవాలయాలకు సోమవారం భూమి పూజలో పాల్గొన్నారు ప్రభుత్వం విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య. ఈ సందర్భంగా ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. పార్టీలకతీతంగా, దాతల సహకారంతో దేవాలయాల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. తమ వంతు సహకారం గ్రామానికి, దేవాలయానికి అందజేస్తామన్నారు. మైలార్ గూడెం గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని విధాలుగా మరింత అభివృద్ధి చేస్తానని విప్ అయిలయ్య పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ పాటుపడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ చీర శ్రీశైలం. నాయకులు గుండ్లపల్లి భరత్ గౌడ్, పుప్పాల నర్సింహులు, దుంబాల వెంకట్రెడ్డి, కాదూరి అచ్చయ్య. బండి అశోక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## జాజిరెడ్డిగూడెం మండల జర్నలిస్టుల నూతన కార్యవర్గం ఎన్నిక



జాజిరెడ్డిగూడెం మండల జర్నలిస్టుల నూతన కార్యవర్గాన్ని సోమవారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతలపాటి. సుధాకర్, ఉపాధ్యక్షుడి గా డి. మల్లికార్జున్, పి. వేణు, ప్రధాన కార్యదర్శిగా పి. రామ్మూర్తీ, కోశాధికారి గా సీహెచ్. సురేష్, సహాయకార్యదర్శిగా వి. సంపత్, సభ్యులుగా కె. శ్రీనివాస్, ఉప్పలయ్య, కె. శ్రీనివాస్ లు ఎన్నికయ్యారు.

## ఎంపీడీవో కార్యాలయంలో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

**హాలియా జనం సాక్షి ఆగస్టు 17**

హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఎంపీడీవో మజీదు తెలిపారు. ప్రజావాణిలో 24 శాఖల అధికారులు హాజరై ఐదుగురు దరఖాస్తు దారులు ఫిర్యాదు సమర్పించగా వాటిని ఆ శాఖలకు బదిలీ చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు





## వలిగొండలో ప్రజావాణి

**వలిగొండ, ఆగస్టు 17( జనం సాక్షి )**

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవోఅధికారి జి. జలంధర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 16 దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 21 శాఖల అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో దశరథ, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారమే బిఎంఎస్ లక్ష్యం

- ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద డిమాండ్స్ డే ధర్నా
- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ
- కనీస వేతనాలు పెంపు, కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయాలి

**ఖమ్మం, ఆగస్టు 17, (జనంసాక్షి) :** కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత మరియు కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ నిరంతరం పోరాటం చేస్తోందని ఖమ్మం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరెంట్ల నారాయణ మరియు యార్లగడ్డ రాఘవరావు తెలిపారు. డిమాండ్స్ డే సందర్భంగా బిఎంఎస్ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో ×ఖమ్మం నగరం లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద నిర్వహించిన ధర్నాలో నాయకులు, వివిధ అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు మరియు కార్యకర్తలు పాల్గొని కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం కార్మికుల ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు.

దేశ ఆర్థిక అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమని, కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే దేశ ప్రగతి మరింత బలపడుతుందని బిఎంఎస్ నాయకులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా కార్మికులకు మెరుగైన వేతనాలు, సామాజిక భద్రత మరియు వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

కార్మికుల కనీస వేతనాన్ని నెలకు 30,000కు పెంచాలి.ఇూఎ వేతన పరిమితిని 21,000 నుంచి 42,000 కు పెంచాలి.ఇఖఈ వేతన పరిమితిని 15,000 నుంచి 30,000 కు పెంచాలి.బోనస్‌కు సంబంధించిన వేతన పరిమితిని 7,000 నుంచి 18,000 కు పెంచాలి.బోనస్ అర్హతకు సంబంధించిన వేతన పరిమితిని 21,000 నుంచి 42,000కు పెంచాలి.కార్మికుల కనీస పెన్షన్‌ను 7,500కు పెంచడంతో పాటు కరువు భత్యం (ఆం), వైద్య సదుపాయాలు కల్పించాలి.కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలి.కార్మిక వ్యతిరేక నిబంధనలను తొలగించి, కార్మికుల హక్కులకు రక్షణ కల్పించే విధంగా లేబర్ కోడ్‌లను అమలు చేయాలి.గ్రాట్యుటీ పరిమితిని 40 లక్షలకు పెంచాలి.బ్యాంకింగ్ రంగంలో వారానికి ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలి





ఈపీఎఫ్ ఈఎస్ఐసి వంటి సామాజిక భద్రతా వ్యవస్థలు కార్మికుల భవిష్యత్తుకు ఎంతో కీలకమైనవని బిఎంఎస్ నాయకులు అన్నారు. ప్రస్తుతం ఉన్న వేతన పరిమితులను పెంచడం ద్వారా మరింత మంది కార్మికులకు సామాజిక భద్రతా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత మరియు చట్టపరమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమను వినియోగించుకుంటూ వారి హక్కులను విస్మరించే విధానాలకు స్వస్తి పలకాలని స్పష్టం చేశారు. అధ్యక్ష కార్యదర్శులు నారాయణ , రాఘవ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన ఈ డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని కోరారు. కార్మికుల సమస్యలను కేవలం ఆర్థిక అంశంగా కాకుండా కార్మిక కుటుంబాల జీవన భద్రత, సామాజిక న్యాయం మరియు దేశ ఆర్థిక ప్రగతికి సంబంధించిన అంశంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు.ఖమ్మం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద నిర్వహించిన డిమాండ్స్ డే ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడం ద్వారా స్థానికంగా పరిష్కరించగల సమస్యలపై జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాల పరిధిలోని అంశాలను సంబంధిత ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని బిఎంఎస్ కోరింది. "దేశ హితం ? పరిశ్రమ హితం ? కార్మిక హితం" అనే ఆశయంతో బిఎంఎస్ కార్మికుల హక్కులు, గౌరవం, సంక్షేమం మరియు సామాజిక భద్రత కోసం నిరంతరం పోరాడుతుందని నాయకులు స్పష్టం చేశారు.కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం అవసరమైన అన్ని ప్రజాస్వామ్య మార్గాల్లో ఉద్యమాలను కొనసాగిస్తామని, కార్మికుల గొంతుకగా బిఎంఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తోడుపునూరి రవీందర్, రాయల సీతయ్య, తోట పున్నారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ వేణుగోపాల్ రావు, జాయింట్ సెక్రెటరీలు కామని వెంకటేశ్వర్ రావు,మిక్కిలినేని సునీల్,కార్తీక్ మాధవి, నరేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## సరోజనమ్మ, సత్యనారాయణల జ్ఞాపకార్థం బస్సు షెల్టర్ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల శంకుస్థాపన

**చండూరు, ఆగస్టు 17 (జనంసాక్షి)** స్థానిక ప్రయాణికుల సౌకర్యార్థం చండూరు మున్సిపల్ కేంద్రంలో నిర్మించనున్న బస్సు షెల్టర్‌కు మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తేలుకుంట్ల రాజకుమారి తన తల్లిదండ్రులు సరోజనమ్మ, సత్యనారాయణల జ్ఞాపకార్థం ఈ బస్సు షెల్టర్ నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా గంగయ్య

**జాజిరెడ్డిగూడెంజనంసాక్షి):** తెలంగాణ సర్పంచ్ ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మండలానికి చెందిన లోయపల్లి సర్పంచ్ వల్లపు గంగయ్య సోమవారం నియమితులయ్యారు. ఈ సమావేశంలో సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ నియామక పత్రాన్ని గంగయ్య కు అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు యాదయ్య గౌడ్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం గంగయ్య సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

# కల్యాణ లక్ష్మికి ఎసరు పెడితే కాంగ్రెస్ సర్కార్‌కు పుట్టగతులుండవు

## మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి

- తులం బంగారం ఇస్తామని మోసం.. పథకాన్నే ఎత్తేసే కుట్ర!
- కే.టీ.ఆర్ పిలుపుతో చండూరు చౌరస్తాలో బిఆర్ఎస్ భారీ రాస్తారోకో, ధర్నా..
- మహిళాగ్రహంతో కదం తొక్కిన గులాబీ శ్రేణులు..

**చండూరు, ఆగస్టు 17 (జనంసాక్షి)** రాష్ట్రంలోని నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసానిచ్చే ప్రతిష్టాత్మక 'కల్యాణ లక్ష్మి', 'షాదీ ముబారక్' పథకాలను రద్దు చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.ఆర్ పిలుపు మేరకు సోమవారం చండూరు మండల కేంద్రం లోని ప్రధాన చౌరస్తాలో బీఆర్ఎస్ శ్రేణులు భారీ ఎత్తున రాస్తారోకో, ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించాయి. పెద్ద ఎత్తున తరలి వచ్చిన మహిళా లోకం, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన గళం విప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో పేదింటి ఆడపిల్లలకు మేనమామగా నిలిచి రూ. 1,00,116 ఆర్థిక సాయాన్ని నిరాటంకం గా అందిం చారని గుర్తుచేశారు. ఎన్నికల వేళ కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు ఏకంగా అసలు పథకానికే ఎసరు పెట్టేలా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. కోర్టు వివాదాల్లో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా సరైన కౌంటర్ దాఖలు చేయకుండా కాలయాపన చేస్తూ పేదల సంక్షేమాన్ని దూరం చేస్తోందని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం మేల్కొని న్యాయస్థానంలో పటిష్టమైన వాదనలు వినిపించాలని, ఇచ్చిన హామీ మేరకు తులం బంగారంతో కలిపి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పేదల సంక్షేమ పథకాలకు గండి కొడితే మహిళల ఆగ్రహజ్వాలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం భస్మం కాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొత్తపాటి సతీష్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎత్తపు మధుసూదన్ రావు, మండల ఆధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్, యువజన అధ్యక్షులు ఉజ్జిని అనిల్ రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దగోని వెంకన్న గౌడ్, బిఆర్ఎస్ నాయకులు తేలు కుంటచంద్రశేఖర్, సామ యాదవ రెడ్డి, నకిరికంటి రాములింగం,మహమ్మద్ గౌస్, ఇడికూడ నాగరాజు, సంగెపు సువర్ణ, నందికొండ నరసింహారెడ్డి, చొప్పరి దశరథ, ఇరిగి రామన్న, నారపాక శంకర్,అన్నెపాక ధనయ్య, నక్క సుధీర్,స్థానిక బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ నాయకులు, మహిళా విభాగం నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో 9 దరఖాస్తులు.

నేరేడుచర్ల ఆగస్టు17 (జనంసాక్షి ): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో సోమ సుందర్ రెడ్డి అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రజల నుండి 9, మున్సిపల్ శాఖకు 1 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలు,వినతులను ఆయా శాఖల అధికారులతో కలిసి స్వీకరించామన్నారు. ఆయా శాఖల పరిధిలోని సమస్యలను పరిశీలించి,సంబంధిత దరఖాస్తులను ప్రజావాణి పోర్టల్ లో నమోదు చేసి, దరఖాస్తుదారులకు రసీదులు అందజేశామన్నారు. దరఖాస్తులలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని 3,కందుల వారి గూడెం గ్రామంలో రోడ్డు ఆక్రమణ,జానలదిన్నె గ్రామంలో కరెంటు సమస్య,నేరేడుచర్ల పట్టణంలో ఎస్సారెస్పి కాలువ ఆక్రమణ,నరసయ్య గూడెంలో ప్రాథమిక పాఠశాలకు బడిబాట, పులగం బండ తండా గ్రామంలో చెరువు ఆక్రమణ,దిర్శించర్ల ఇటుక బట్టీలు అనుమతులు లేవంటూ దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులు పరిశీలించి ఆయా శాఖల అధికారులతో నెల రోజులలో సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సైదులు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు,అన్ని శాఖలకు సంబంధించిన సంబంధిత అధికారులు,ఇన్చార్జి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# దమ్మపేట తాసిల్దార్ కార్యాలయంలో బిఆర్ఎస్ నిరసన





**దమ్మపేట ఆగస్టు 17 (జనం సాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలమేరకు దమ్మపేట తాసిల్దార్ కార్యాలయం ఎదుట అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే,బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నాయకులతో కలిసి నిరసన చేపట్టి, డిమాండ్లతో కూడిన మెమొరాండంని డిప్యూటీ తహశీల్దార్ కి అందజేశారు. ఈ సందర్భంగా మెచ్చా మాట్లాడుతూ దోచుకోవడం దోచుకోవడమే పనిగా ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు పెట్టుకున్నారని,ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారని,కోట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో ఏ ఆడబిడ్డ ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో ఒక మేనమామలా కెసిఆర్ కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టి ఎంతో మందికి ఆర్థికంగా సహాయపడ్డారని. 2023 ఎన్నికల సమయంలో కెసిఆర్ కేవలం లక్ష మాత్రమే ఇస్తున్నారు నేను గెలిచిన రోజు నుంచి లక్షతో పాటు తులం బంగారం కూడా ఇస్తానని ఆడబిడ్డలను నమ్మబలికి నేడు అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయకపోగా,ఇప్పటికే అమలులో ఉన్న పథకాన్ని ప్రశ్నార్థకంగా మార్చేశారని. గ్రామాల్లో ఆడబిడ్డలు కాంగ్రెస్ నాయకులను నిలదీస్తుంటే ఏం చెయ్యాలో తెలియని పరిస్థితుల్లో కాంగ్రెస్ నాయకులు ఉన్నారని. తులం బంగారం భారం నుంచి తప్పించుకోవడం కోసమే ఈ పథకాన్ని నిలిపివేయడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్ లో ఉన్న అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఆలస్యం లేకుండా ఆర్థిక సహాయం విడుదల చెయ్యడంతో పాటు. హైకోర్టు కేసులో ప్రభుత్వం తీసుకున్న చర్యలపై స్పష్టత ఇవ్వాలని. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తులం బంగారం హామీని ఎప్పుడు,ఎలా అమలు చేస్తుందో స్పష్టమైన ప్రకటన చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు దొడ్డ రమేష్,మాజీ వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు,మాజీ మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసు బాబు,నాయకపోడు సంఘం రాష్ట్ర నాయకులు రావుల శ్రీనివాసరావు,మండల నాయకులు తుమ్మల లక్ష్మనరావు,మాజీ నియోజకవర్గ యూత్ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు,మాజీ ఎంపీటీసీలు దేవరలపల్లి అజయ్ కుమార్,జలగం వాసు,అబ్దుల్ జిన్నా,సర్పంచ్లు యాట్ల రాందాస్,కొమరం సుశీల,ఉప సర్పంచ్ రామకృష్ణ,వార్డ్ మెంబర్లు దారా రాము,రూప రాంబాబు,వేలుగోటి మహేష్,కాసిని శ్రీను,మద్దెల పుల్లారావు,అడపా వెంకట నరసయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను

# యథావిధిగా కొనసాగించాలి

- తహసిల్దార్ కార్యాలయం ఎదుట బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా..
- పేదల సంక్షేమ పథకాలపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, మహిళలు,కార్యకర్తలు





**మణుగూరు, ఆగస్టు 17 (జనంసాక్షి):** పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెళ్లి కానుకగా అందిస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ఎలాంటి ఆంక్షలు, ఆటంకాలు లేకుండా యథావిధిగా కొనసాగించాలని బి ఆర్ ఆర్ పట్టణ అధ్యక్షుడు కుంటా లక్ష్మణ్ అన్నారు. సోమవారం మణుగూరు తహసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ధర్నా సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పేదలకు అందుబాటులో ఉండేలా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహం ఆర్థికంగా ఎంతో భారంతో కూడుకున్నదని, అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం ఎంతో అండగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గత కొంత కాలంగా అమలవుతున్న ఈ సంక్షేమ పథకాల ద్వారా ఎంతోమంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు ప్రయోజనం కలిగిందని అన్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో ఆడపిల్లల వివాహానికి ఈ పథకాలు ఒక భరోసాగా మారాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పోశం నరసింహారావు, మాజీ కోఆప్షన్ సభ్యులు పాషా, టౌన్ అధ్యక్షుడు కుంటా లక్ష్మణ్, యాదగిరి, వట్టం రాంబాబు, తురక రామకోటి, అప్పారావు, చెన్నకేశవులు, కమ్మంపాటి శ్రీనివాస్, ముద్దంగుల కృష్ణ, యగ్గడి. నరసింహారావు వేర్పుల సురేష్ , దమ్మకపేట సర్పంచ్ మడి స్వరూప, మాజీ సర్పంచులు, బొగ్గం రజిత, సుజాత, అడపాల సత్యవతి, జెన్నా స్వర్ణలత, ఆవుల జానకి, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ రద్దుకు కుట్ర

## బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



తుంగతుర్తి ఆగస్టు 17 (జనం సాక్షి) పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరానికి ఆర్థిక భరోసా కు ప్రత్యేక గా నిలిచిన కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తుందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ సూచనలతో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని మహిళా నాయకులతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం నియోజకవర్గ కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ హైకోర్టు తీర్పును సాకుగా చూపుతూ లక్షలాది పేద కుటుంబాలకు అండగా నిలిచిన ఈ పథకాలను ఎత్తివేసేందుకు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు ఈ కుట్రను అడ్డుకోవడంతో ప్రజల ముందరికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాదని, తెలంగాణ పేద కుటుంబాల ఆడబిడ్డల భవిష్యత్తు, ఆత్మగౌరవంతో ముడిపడిన కార్యక్రమాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 అక్టోబర్ 2న ఈ పథకాలను ప్రారంభించారని గుర్తుచేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తుంగతుర్తి, తిరుమలగిరి మాజీ ఎంపీపీ లు గుండగాని కవిత రాములు గౌడ్,నెమరు గొమ్ముల స్నేహలత, కొమ్మినేని సతీష్, మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్, తిరుమలగిరి మున్సిపల్ కౌన్సిలర్ లు పనికర లక్ష్మి, సోమలక్ష్మి, శకుంతల, గీత, జ్యోతి, త్రిశూల్, సర్పంచులు చింతకుంట్ల మనోజ్, మేడుదల రమేష్ గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ నాయకులు,మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలి

**మధిర, ఆగస్టు 17 (జనంసాక్షి):**
గత కేసీఆర్ ప్రభుత్వం పేదల పెళ్లిళ్లకు ఆసరాగా తీసుకొచ్చిన 'కళ్యాణ లక్ష్మి', షాదీ ముబారక్ పథకాల అమల్లో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని బీఆర్ఎస్ మధిర నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ పథకాలపై కోర్టు స్టే విధించాల్సి వచ్చిందని వారు ఆరోపించారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులు మధిర తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. పేద కుటుంబాలకు కొండంత అండగా నిలిచే ఈ పథకాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతు "పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతగానో తోడ్పడ్డాయన,.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఈ పథకాల నిర్వహణను పక్కనబెట్టడంతో అర్హులైన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారుఅని మండిపడ్డారు.

ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం ఫలాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి పోరాటం చేసి సాధించుకుంటామని హెచ్చరించినారు

ఈ కార్యక్రమంలో బిక్కి కృష్ణ ప్రసాద్, చిత్తారు నాగేశ్వరరావు, పల్లపోతు వెంకటేశ్వరరావు, అరెగ శ్రీనివాసరావు , ఆళ్ల నాగబాబు, బొగ్గుల వీరారెడ్డి, చీదిరాల రాంబాబు, వేల్పుల శివ, నీలం రమేష్, మార్త అప్పారావు, అబ్దుల్ ఖురేష్ వేల్పుల శ్రీను, అంగడాల గోపి తదితర నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొనసాగించాలి: నోముల భగత్



హాలియా, ఆగస్టు 17 జనం సాక్షి: కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ శాసనసభ్యులు నోముల భగత్‌కుమార్ ఆరోపించారు. పేద కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు అండగా నిలుస్తున్న ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేయకుండా యథావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు నల్గొండ జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నోముల భగత్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారం అందించడంతో పాటు ఆర్థిక సహాయాన్ని కొనసాగించాలని కోరారు. అదేవిధంగా నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అర్హత ఉన్నప్పటికీ గుడిసెల్లో, దుర్భర పరిస్థితుల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని నోముల భగత్‌కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, రాంచందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ముసాయిదా ఓటరు జాబితా విడుదల



- ❑ క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సెప్టెంబర్ 16 వరకు అవకాశం... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ❑ ఖమ్మం జిల్లాలో 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల
- ❑ 1,76,135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు
- ❑ ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం

**ఖమ్మం, కార్పొరేషన్, ఆగస్టు-17 (జనంసాక్షి)** సోమవారం ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేశామని, క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఏమైనా ఉంటే సెప్టెంబర్ 16 లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.

జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ, ముసాయిదా ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితా, గుర్తించిన అనామలీస్, మ్యాపింగ్ లేని ఓటర్ల వివరాలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కార ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ× భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 10,85,927 మంది ఓటర్లతో ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైందన్నారు. ఇందులో 5,24,894 మంది పురుష, 5,60,973 మంది మహిళా, 60 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో 1,33,004 మంది అంటే 12.24 శాతం ఓటర్లను అనామలీస్ గుర్తించగా, 43,131 మంది అంటే 3.97 శాతం ఓటర్లకు మ్యాపింగ్ కానట్లు గుర్తించినట్లు మొత్తం 1,76,135 మంది ఓటర్లకు ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారుల ద్వారా నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు.

**నోటీసులు అందుకున్న వారు సంబంధిత పత్రాలు సమర్పించాలి**

నోటీసులు అందుకున్న ఓటర్లు తమ పుట్టిన తేదీ ఆధారంగా భారత ఎన్నికల సంఘం సూచించిన పత్రాల్లో సంబంధిత పత్రాలను సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

**ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు పరిశీలించుకోవాలి**

ఆగస్టు 17న ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేనట్లయితే బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి లేదా ఎన్నికల నమోదు అధికారిని సంప్రదించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వెబ్‌సైట్ ద్వారా తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ముసాయిదా జాబితాలో పేరు లేనట్లయితే లేదా వివరాల్లో ఏవైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే ×సెప్టెంబర్ 16, 2026లోగా× అభ్యంతరాన్ని సమర్పించవచ్చని తెలిపారు. అదేవిధంగా అర్హత కలిగిన కొత్త ఓటర్లు ఫారమ్-6 ద్వారా సెప్టెంబర్ 16లోగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అన్నారు.

**అర్హులైన కొత్త ఓటర్లు నమోదు చేసుకోవచ్చు**

ప్రస్తుతం కూడా అర్హులైన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. 2026 అక్టోబరు 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు, ఏ శాసనసభ నియోజక వర్గంలోనూ ఓటరుగా నమోదు కాకపోతే ఫారమ్-6 ద్వారా తాజా ఫొటో, వయస్సు ధృవీకరణ పత్రం, డిక్లరేషన్ తదితరాలను జతచేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

చనిపోయిన లేదా డూప్లికేట్ ఓటర్లపై అభ్యంతరాలు తెలియజేయడానికి ఫారమ్-7, మొబైల్ నంబర్ నవీకరణ, చిరునామా మార్పు, ఓటరు గుర్తింపు కార్డులో వివరాల సవరణలకు ఫారమ్-8 వినియోగించుకోవచ్చని వివరించారు.

**క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు సెప్టెంబర్ 16 వరకు అవకాశం**

ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితాపై ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించవచ్చని తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియ ఆగస్టు 17 నుంచి అక్టోబర్ 15 వరకు కొనసాగుతుందని చెప్పారు.

**అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితా**

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19, 2026న ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావడంతో పాటు తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకునేలా సహకరించాలని సూచించారు.

ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాల కోసం బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎన్నికల నమోదు అధికారులను సంప్రదించవచ్చని, అలాగే టోల్‌ఫ్రీ 1950కు ఫోన్ చేయవచ్చని తెలిపారు.

ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్డీసి సదానందం, ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, బీ.ఆర్.ఎస్. పార్టీ ప్రతినిధులు బి.వేణు గోపాల్, సతీష్ బాబు, ఎం.రమేష్, టీడీపీ ప్రతినిధి కృష్ణప్రసాద్, బీజేపీ ప్రతినిధి వి.రాజేష్, సిపిఎం డి.తిరుపతి రావు, కె.ప్రకాశం, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, సిహెచ్ నవీన్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ఏ.గోపాల రావు, జి.సూర్య నారాయణ, బిఎస్పీ వేల్పుల రామయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బయ్యారం వైకుంఠధామం నిర్మాణంపై సమగ్ర విచారణ జరపాలి

**మధిర, ఆగస్టు 17 (జనంసాక్షి):** మధిర మండలం బయ్యారం గ్రామంలో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన వైకుంఠధామం నిర్మాణం, నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వైకుంఠధామం నిర్మాణానికి నిధులు ఎలా మంజూరయ్యాయి ఎంత మొత్తం ఖర్చు చేశారు పనులు ఎవరి ఆధ్వర్యంలో జరిగాయి కాంట్రాక్టర్‌కు ఎంత చెల్లించారు నిర్మాణం పూర్తయిన కొద్దికాలానికే శిథిలావస్థకు చేరడానికి కారణమేంటి? అనే అంశాలపై అధికారులు విచారణ చేయాలని కోరుతున్నారు. అలాగే, వైకుంఠ ధామం నిర్మాణనీ బయ్యారం క్రిస్టియన్ల కుటుంబాలకు అవసరం ఉందా, ఎంత వరకు ఉపయోగపడుతోంది, అప్పటి సర్పంచ్ మరియు కాంట్రాక్టర్ నిధులు నిర్దేశిత పనికే వినియోగించారా లేదా నిధులు దుర్వినియోగం జరిగిందా అనే విషయాలను ఎం బుక్, బిల్లులు, వౌచర్లు, అనుమతులు, పంచాయతీ తీర్మానాలు, చెల్లింపు రికార్డులను పరిశీలించి తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. వైకుంఠదామం నిర్మాణం పూర్తి చేసినట్టు చెప్తున్న అధికారులు ఎన్ని సంవత్సరాలు ఐన ప్రారంభానికి నోచుకోలేదు అని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే అప్పటి సంబంధిత సర్పంచ్ కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రభుత్వ నిధులను తిరిగి రాబట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి

**ఎర్రుపాలెం, ఆగస్టు 17 (జనంసాక్షి)** :ఎర్రుపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం గతంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే ప్రభుత్వ ఆదేశాలతో ప్రజావాణి మార్పు చేసి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించాలని ప్రభుత్వ ఉత్తర్వులతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శారద, తాసిల్దార్, సునీత ఎలిజిబెత్, ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. పలు సమస్యలపై వచ్చిన దరఖాస్తులు 23 వచ్చినట్టు తెలిపారు. మీనవోలు గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అంగన్వాడీ భవనం తొలగించి నూతన భవనం నిర్మించాలని దరఖాస్తుచేసుకున్నారు. జమలాపురం చెరువు చేపల సొసైటీ లో గతంలో కొంతమంది మాత్రమే సభ్యత్వాలు ఉన్నట్లు ఇంకా మరి కొంతమంది సుమారు 25 మంది కి వాటాదారులుగా సభ్యత్వాలు ఇవ్వాలని జమలాపురం గ్రామానికి చెందిన మొవ్వ నెల్సన్ పలువురు లబ్ధిదారులతో కలిసి ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. అలాగే మీనవోలు గ్రామంలోని పాఠశాల స్థలం విస్తీర్ణం సర్వే చేయించాలని కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో, శారద, తాసిల్దార్, సునీత ఎలిజిబెత్, ఎంపీవో త్యాగరాజు ఆర్.ఐ, శిరీష, జి పి ఓ లు, పంచాయతీ కార్యదర్శులు పలు శాఖల అధికారులు పలువురు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






## గిరిజనుల సాగులో ఉన్న భూములకు బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి

### భద్రాచలం ఐ టి డి ఎ పి ఓ కు వినతిపత్రం

**పెనుబల్లి, ఆగస్ట్ 17 (జనంసాక్షి)**

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పెనుబల్లి మండల కమిటీ ఆధ్వర్యంలోసోమవారం మండలంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని, బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని భద్రాచలం ఐటిడిఏ పిఓకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ పెనుబల్లి మండలంలో 10 గ్రామాలలో గిరిజనులు గత 20 సంవత్సరాల నుండి పోడు వ్యవసాయం చేసుకుంటున్నారన్నారని. ఈ భూములలో వ్యవసాయం చేసుకోవడం కొరకు నీటి వసతులు లేక, సరిగా వర్షాలు పడక, వేసిన పంటలు ఎండిపోవడంతో గిరిజన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. గిరిజనులకు సబ్సిడీ ద్వారా ఎరువులు, వ్యవసాయ యంత్రాలు, బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సాగులో వున్న కొంతమంది గిరిజనులకు హక్కు పత్రాలు ఇవ్వలేదని అన్నారు, వారికి ప్రభుత్వం నుండి రావాల్సిన రుణాలు పొందలేక పోతున్నారాన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం పెనుబల్లి మండల అధ్యక్షులు గాయం తిరుపతిరావు, మండల కమిటీ సభ్యులు రాజినేని మంగమ్మ, వడ్డేగ బజారు, కుంజా రాములు, చిలక రమణమ్మ, కుంజా ఈద బాబు, కుంజా నరసమ్మ, పద్మ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలి : బీఆర్ఎస్ నాయకులు డిమాండ్

**ఎర్రుపాలెం, ఆగస్ట్ 17 (జనంసాక్షి):**
పేద కుటుంబాల్లోని ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తూ సోమవారం ఎర్రుపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు వేలాది కుటుంబాలకు అండగా నిలిచాయని నాయకులు పేర్కొన్నారు. అయితే ఈ పథకాల అమలుకు సంబంధించి హైకోర్టులో దాఖలైన కేసు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లన మధ్యంతర ఉత్తర్వులు వెలువడటంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొందన్నారు. ఇప్పటికే వివాహాలు చేసుకున్న పేద కుటుంబాలు, వివాహాలకు సిద్ధమవుతున్న ఆడబిడ్డల తల్లిదండ్రులు ఈ పరిణామంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలిచే సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం తక్షణమే న్యాయపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుకు సంబంధించి ప్రభుత్వం వెంటనే సమగ్ర కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసి, పథకాల కింద లబ్ధిదారులకు అందాల్సిన ఆర్థిక సాయం నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అర్హత సాధించిన లబ్ధిదారులకు రావాల్సిన ఆర్థిక సహాయాన్ని ఆలస్యం చేయకుండా అందించాలని కోరారు. పేదల ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచే ఈ పథకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయొద్దని, ప్రభుత్వం తక్షణమే స్పందించి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను నిరంతరాయంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ పథకాలపై ఆధారపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం స్పష్టమైన భరోసా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శీలం కవిత, మండల కార్యదర్శి



యన్నం శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు గూడూరు రమణారెడ్డి, శేగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, కుడుముల మల్లికార్జున రెడ్డి, బొర్ర నరసింహారావు, యరమల కృష్ణారెడ్డి, గద్దల శ్రీనివాసరావు, వేమిరెడ్డి బ్రహ్మానందరెడ్డి, కూరపాటి నాగేశ్వరరావు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ

**పినపాక, ఆగస్టు17(జనం సాక్షి):**
మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించబడిన ప్రజావాణి కార్యక్రమానికి మండల ప్రజల నుంచి సమస్యలతో కూడిన 11 వినతిపత్రాలను స్వీకరించడం జరిగినదని ఎంపీడీవో సంకీర్త పత్రిక ముఖంగా తెలిపారు. రెవిన్యూ శాఖ 5, విద్యుత్ శాఖ 2, గృహ నిర్మాణ శాఖ 2, పంచాయతీరాజ్ శాఖ 1, వైద్య శాఖ 1 తో కూడిన వినతి పత్రాలను మండల ప్రజలు ప్రజావాణి కార్యక్రమంలో అందజేయడం జరిగింది. ప్రజావాణిలో వచ్చిన 11 దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులకు పంపించి ఆన్లైన్ చేసినట్లుగా ఆయన తెలియజేశారు. దరఖాస్తు దారు ప్రజావాణిలో ఇచ్చిన ప్రతి దరఖాస్తు ఆన్లైన్ స్టేటస్ చరవా?ణి ద్వారా సైతం చెక్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి వినతిని పరిశీలించి సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తామని అధికారులు తెలిపారు.

# బిఆర్ఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

**కల్లూరు, ఆగస్టు 17 (జనం సాక్షి)**
ప్రజా వ్యతిరేక విధానాలపై మంగళవారం నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరుపట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్ బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు పెడకంటి రామకృష్ణ గృహం లో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మీడియా సమావేశంలో మాట్లాడు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిరుపేదల కష్టాలను కళ్లారా చూసిన కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల హామీలో లేకపోయినా మానవతా దృక్పథంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని సండ్ర వెంకట వీరయ్య గుర్తుచేశారు. మొదట రూ.50 వేలతో ప్రారంభించిన ఈ పథకాన్ని అనంతరం రూ.1,00,116లకు పెంచి పదేళ్లపాటు పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా నిలిచారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించడంపై నిర్లక్ష్యం వహిస్తోందని సండ్ర ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు సండ్ర వెంకట వీరయ్య తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ఇటీవల వైద్య చికిత్సలు చేయించుకొని స్వగృహాల వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కల్లూరు పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చారు గుండ్ల అచ్యుతరావు, యజ్ఞ నారాయణపురం గ్రామ ఉప సర్పంచ్ రావి సూర్యనారాయణలను మాజీ ఎమ్మెల్యే సండ్ర. వెంకట వీరయ్య వారి స్వగృహాలకెళ్ళి పరామర్శించి, ఆరోగ్య యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు., వైద్యుల సూచనల మేరకు ఆరోగ్య ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్లు కాటమనేని వెంకటేశ్వరరావు, పెద్ద బోయిన మల్లేశ్వరరావు, మాజీ జడ్పిటిసి మున్సిపల్ కౌన్సిలర్ లక్కినేని రఘు, మాజీ జడ్పిటిసి మేకల కృష్ణ, కౌన్సిలర్లు పెడకంటి కృష్ణయ్య, ఎండి ఇస్మాయిల్, బిఆర్ఎస్ నాయకులు దార్ల నరసింహారావు, సయ్యద్ ఇంతియాజ్, కొర్ర కొప్పు ప్రసాద్ లింగాల గ్రామ సర్పంచ్ వేము కృష్ణ, , కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఉబ్బన వెంకటరత్నం, రావుఫ్, కట్ట ఆర్లప్ప, కళ్యాణ్ కిషోర్, చారుగుండ్ల సందీప్, మాజీ వార్డు సభ్యులు సీనియర్ నాయకులు బొల్లం వెంకటేశ్వరరావు, బానోత్ బాలు, అజ్మీర జములయ్య, బానోత్ కృష్ణ,జానీ మియా, సిహెచ్ కిరణ్, నాయకులు పాల్గొన్నారు.



# కళ్యాణ్ లక్ష్మి, షాది ముబారక్ పథకాలను కొనసాగించాలి

## పగడాల సతీష్ రెడ్డి



**పినపాక, ఆగస్టు17(జనంసాక్షి):**
పేద మధ్యతరగతి కుటుంబాలలోని ఆడబిడ్డల కళ్యాణం కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని మండల బి ఆర్ ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బి ఆర్ ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజల ముందు ఉంచేందుకు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మండలంలోని బయ్యారం క్రాస్ రోడ్ నందు ధర్నా నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ఆర్థిక భరోసా కు అండగా నిలిచిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలను ఉద్దేశపూర్వకంగా ఎత్తివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. పేద, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల లోని ఆడబిడ్డల పెళ్లిళ్లు కుటుంబ సభ్యులకు భారం కాకూడదని సదుద్దేశంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 లో ఈ బృహత్తర పథకాన్ని ప్రవేశపెట్టి పగడ్బందీగా అమలు చేశారని ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మి తో పాటు ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, బంగారం సంగతి దేవుడెరుగు ఉన్న పథకాన్ని రద్దు చేయడానికి ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



**కల్లూరు ఆగస్టు17( జనంసాక్షి)**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పేర్కొన్నారు. చంద్రుపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025?26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు గ్రామానికి చెందిన మల్లేశ్వరి ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ నిర్వాహకులు డాక్టర్ మాగంటి ప్రభాకర్‌రావు సోమవారం ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. పదో తరగతి ఫలితాల్లో రామిశెట్టి సాయి వెన్నెల 571 మార్కులు,ఎస్.కె. నసీమా 551 మార్కులు,పవన్‌సాయి 540 మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వరుసగా రూ.5,000, రూ.3,000, రూ.2,000 చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని డాక్టర్ ప్రభాకర్‌రావు విద్యార్థుల తల్లిదండ్రులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలోనూ విద్యార్థుల ప్రోత్సాహానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేస్తానని ప్రకటించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ మాగంటి ప్రభాకర్‌రావును పాఠశాల సిబ్బంది,గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్,గ్రామస్తులు కాటంనేని బాబురావు, పరిగడుపు శివ,సెక్రటరీ జొన్నగడ్డ లక్ష్మణరావు, పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పై కాంగ్రెస్ నాయకుల ఫైర్

◆అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ కుట్రలు
◆రైతుల పొలాల్లో మన్ను చల్లి నేడు కన్నీళ్లు కారుస్తున్న బిఆర్ఎస్ నాయకులు
◆నాడు భూములు గుంజుకొని.. నేడు డిప్యూటీ సీఎం భట్టిపై బురద జల్లడమేంటి..?
◆కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రామకోటేశ్వరావు ఫైర్




**బోనకల్, ఆగస్టు 17 (జనంసాక్షి):** మధిర నియోజకవర్గ వ్యాప్తంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నేతలు కుట్రలకు పాల్పడుతున్నారని బోనకల్ మండల కాంగ్రెస్ నాయకులు శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. బిఆర్ఎస్ తన పదేళ్ల పాలనలో రైతుల ఉసురుపోసుకుని, అధికార మదంతో నోళ్లు నొక్కిన బిఆర్ఎస్ పార్టీ, నేడు అధికారం పోగానే దొంగ ఏడుపులు ఏడుస్తుండటం సిగ్గుచేటని బోనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరావు తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. బోనకల్ మండలం ఆళ్లపాడు-రాయన్నపేట గ్రామాల మధ్య ఉన్న జాలిముడి కాలువ పూడికతీత పనులను అడ్డుకుంటూ బిఆర్ఎస్ నాయకుడు లింగాల కమల్ రాజ్ రైతులను ముందుబెట్టి ఆడుతున్న నాటకాలపై విలేకరుల సమావేశంలో ఆయన విరుచుకుపడ్డారు. 2013లో మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ స్పీకర్ గా ఉన్న సమయంలోనే రైతుల ప్రయోజనాల కోసం జాలిముడి కాలువ తవ్వకానికి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. అయితే ఆ సమయానికి పరిహారం పంపిణీ పూర్తికాకపోవడంతో పనులు నిలిచాయని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ నేతలు తమ కడుపు నింపుకోవడానికి దౌర్జన్యాలకు తెగబడ్డారని ఆరోపించారు. తమ పెద్దల అధికార బలంతో రైతులకు కాపలా పెట్టి నిర్బంధించి, పైసా పరిహారం ఇవ్వకుండా, బెదిరించి దౌర్జన్యంగా భూములను లాక్కున్న నీచ చరిత్ర బిఆర్ఎస్ దేనని మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో రైతులు అప్పటి మంత్రులు, కమల్ రాజ్ చుట్టూ తిరిగినా కనికరించకుండా "అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లు కమల్ రాజ్ ఏం చేశారు?" అని రామకోటేశ్వరరావు నిలదీశారు. తమ భూములకు పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కమల్ రాజ్ ఇంటి చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా, వారిని కనీసం మనుషులుగా కూడా చూడకుండా గెంటేసిన ద్రోహులు నేడు రైతు రక్షకుల్లా నటిస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నాడు రైతులకు తీవ్ర అన్యాయం చేసి, వారికి దక్కాల్సిన హక్కులను కాలరాసిన బిఆర్ఎస్ నేతలకు, నేడు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేనేలేదని స్పష్టం చేశారు.

**ఇది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం.. ప్రతి రైతుకూ న్యాయం చేస్తాం**

నేడు రాష్ట్రంలో ఉన్నది ప్రజల, రైతుల కాంగ్రెస్ ప్రభుత్వమని.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో ప్రతి పేదవాడికి, రైతుకు పార్టీలతో సంబంధం లేకుండా న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నేతలు చేసిన పాపాలను కడిగేసి, జాలిముడి కాలువ బాధిత రైతులకు పరిహారం అందేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన న్యాయం జరిపిస్తామని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా తమ రాజకీయ ప్రయోజనాల కోసం రైతులను వాడుకోవడం మానకపోతే ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలని బిఆర్ఎస్ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు, ఆత్మ కమిటీ డైరెక్టర్ కందుల పాపారావు, మాజీ జడ్పీటీసీ మోదుగు సుధీర్ బాబుతో పాటు పలువురు కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేతన సవరణపై విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

**- 14 డిమాండ్లతో 'చలో విద్యుత్ సౌధ'కు పిలుపు**

**- మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించిన ఉద్యోగ సంఘాల జేఏసీ**

**భద్రాచలం ఆగస్టు 17 (జనంసాక్షి)** విద్యుత్ ఉద్యోగుల 14 డిమాండ్ల సాధన కోసం బుధవారం నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా విద్యుత్ కార్యాలయంలో సోమవారం మహాధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలంకు చెందిన విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు పాల్గొన్నారు. జిల్లా జేఏసీ చైర్మన్ మోహన్ రావు, కన్వీనర్, భద్రాచలం విద్యుత్తు శాఖ డీఈ కే. జీవన్ కుమార్, డీఈటీ నందయ్య, ఎస్ ఏఓ శ్రీధర్, ఏఈ మహేష్, బి. వెంకటరాజు, బి. రామకృష్ణ, ఉదయ్, రత్నకుమార్ మాట్లాడుతూ పీఆర్సీ విద్యుత్ ఉద్యోగుల ప్రాథమిక హక్కు అని అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈపీఎఫ్ ను జీపీఎఫ్ గా మార్చాలని, సాధారణ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని, ఆర్టిజన్లకు ఏపీఎస్ ఈబీ నిబంధనలను అమలు చేయాలని కోరారు. జిల్లాలోని ప్రతి విద్యుత్ ఉద్యోగి 19న జరిగే మహాధర్నాకు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రాజేష్, హేమంత్, అశోక్, శివరంజని, గణేష్ తో పాటు వివిధ యూనియన్లు, అసోసియేషన్ల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు. సుమారు 80 మంది విద్యుత్ ఉద్యోగులు కార్యక్రమానికి హాజరయ్యారు.

## గిరిజనుల అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు



**భద్రాచలం ఆగస్టు 17 (జనంసాక్షి)** గిరిజన దర్బార్ లో స్వీకరించిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో భూ సమస్యలు, పోడు పట్టాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులపై గిరిజనుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, తక్షణ సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శాఖల మధ్య సమన్వయంతో అర్జీల పరిష్కారంపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని పీవో ఆదేశించారు.

# ఆకేరిపై బ్రిడ్జి నిర్మించండి ..!

**రెండు జిల్లాల రైతులకు ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపరచండి**

**హైదర్ సాయి పేట, బిరోలు మధ్య రహదారి నిర్మాణంతో వేలాది మంది ప్రజలు రైతులకు ప్రయోజనం**



**తిరుమలాయపాలెం ఆగస్టు 17 జనంసాక్షి** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి కాస్త ప్రజల సమస్య వానిగా మారినది ప్రజావాణి ప్రజలు వివిధ రకాల సమస్యలతో ప్రజావాణిలో అధికారులకు ఆర్జీలు దాఖలు చేసినారు అందులో ప్రధానంగా ఆకేరి నదిపై బ్రిడ్జి నిర్మించి అధర్ సాయి పేట నుంచి సిరోల్ వరకు రహదారి సౌకర్యం కల్పించాలని ఖమ్మం జిల్లా జేఏసీ అధ్యక్షులు మండది జిరాయిల్ ప్రభుత్వాన్ని కోరారు ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆకేరు పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న రైతులు గ్రామీణ ప్రజలు రాకపోకలకు సరైన రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు ముఖ్యంగా వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లే రైతులు పంటలను మార్కెట్లో తరలించే సమయంలో అనేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు బ్రిడ్జి నిర్మాణం జరిగితే మూడు జిల్లాలకు ప్రయోజనం మధ్య హైదర్ సాయి పేట సిరోలు మధ్య ఆఖరి పైనే బ్రిడ్జి నిర్మించి ఆధారి ఏర్పాటు చేస్తే ఖమ్మం సూర్యాపేట మహబూబాబాద్ జిల్లాలకు ప్రజలకు రవాణా సౌఖ్యం గణనీయంగా మెరుగుపడుతుందని జేఏసీ చైర్మన్ పేర్కొన్నారు గ్రామీణ ప్రాంతాల మధ్య దూరం తగ్గడంతో విద్యార్థులు రైతులు ఉద్యోగులు వ్యాపారులు అత్యవసర వైద్య సేవలు పొందే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్నా సమస్యకు శాశ్వతం చూపాలని అవసరం ఉందని కేవలం ఒక్క బ్రిడ్జి నిర్మాణం కాకుండా మూడు జిల్లాలకు కొనసానదాన్నించే కీలక రవాణ్యం రవాణా మార్గాన్ని ఈ ప్రాజెక్టును ప్రభుత్వం పరిధిలోకి ప్రకటించాలని కోరారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ సోపాలి ఖమ్మం జిల్లా ప్రజా సమస్యలపై స్పందించే ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సవరించాలని ఇజ్రాయిల్ సంబంధిత అధికారులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి బ్రిడ్జి నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించి ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లాలని కోరారు ఆగిరి బ్రిడ్జి నిర్మాణానికి అవసరమే నిధులు మంజూరు చేస్తే అధర్సాయి పేట నుంచి శిరోల్ వరకు రహదారి నిర్మాణాన్ని చేపడితే ఆ ప్రాంత ప్రజలకు చిరకాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఇది ఒక గ్రామానికి సంబంధించిన సమస్య కాదు మూడు జిల్లా ప్రజల మూడు జిల్లాల ప్రజల అంశం ప్రభుత్వం వెంటనే స్పందించి ఆకేరుపై బ్రిడ్జి నిర్మాణానికి చేరేలు ప్రారంభించాలని కోరారు.

## కళ్యాణ లక్ష్మీ,షాది ముబారక్ పథకాన్ని కొనసాగించాల్సిందే

**తులం బంగారం ఇవ్వాల్సిందే:మాజీ ఎమ్మెల్యే మెచ్చా**



అశ్వరావుపేట ఆగస్టు17,(జనంసాక్షి): అశ్వరావుపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కళ్యాణ లక్ష్మీ ,షాది ముబారక్ పథకాన్ని నిలిపివేయడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాలమేరకు నేడు అశ్వారావుపేట ఎమ్మార్వో కార్యాలయం ఎదుట అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నాయకులతో కలిసి నిరసన చేపట్టారు.డిమాండ్లతో కూడిన మెమొరాండంని తహశీల్దార్ కి అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జూపల్లి రమణారావు,మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి,యుఎస్ ప్రకాశ్ రావు,సంక ప్రసాద్,సర్పంచ్ నాగమణి,మాజీ సర్పంచ్ నారం రాజ్ శేఖర్,దుర్గయ్య,కలపాల బాబురావు,ఆరేపల్లి రాంబాబు,వెలేటి పార్వతి, శెట్టిపల్లి రఘురాం,శ్రీదేవి,కృష్ణ,చందా లక్ష్మీ నర్సయ్య,నరసింహం,కుమార స్వామి

## అభివృద్ధి పనులకు శ్రీకారం

**రూ.11.50 కోట్ల ఎంపీ నిధులతో మండలంలో అభివృద్ధి పనులు**

**యర్రగుంట, రామకృష్ణాపురంలో సీసీ రోడ్లు ప్రారంభం.. మర్రిగూడెంలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన**

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 17 (జనంసాక్షి)** అన్నపురెడ్డిపల్లి మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ప్రారంభించడంతో పాటు డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. యర్రగుంట, రామకృష్ణాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం మర్రిగూడెం గ్రామంలో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడనున్నాయని ప్రజాప్రతినిధులు తెలిపారు.

**రూ.11.50 కోట్ల నిధులు మంజూరు**

ఈ సందర్భంగా ఎంపీ రామసహాయం రఘు రామిరెడ్డి మాట్లాడుతూ.. అన్నపురెడ్డిపల్లి మండలంలో ఎంపీ నిధుల ద్వారా వివిధ అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.11.50 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రంగా నిధులను వినియోగిస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రభుత్వంతో పోరాడి అధిక నిధులు, ఇందిరమ్మ ఇళ్లు తీసుకువస్తున్నారని ఎంపీ ప్రశంసించారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నిరంతరం శ్రమిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజలు ఆయనకు మళ్లీ మద్దతు ఇస్తారని అన్నారు.

**చేతిపంపు కోసం వినతి**

రామకృష్ణాపురం గ్రామంలోని బీరప్ప దేవాలయం వద్ద చేతిపంపు మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్తులు ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో ఇబ్రహీం, మండల అధ్యక్షుడు పర్స వెంకట్, యువజన అధ్యక్షుడు వేముల నరేష్, దుబాకుల రాము, రమణ, పంచాయతీ కార్యదర్శి సురేష్, నాగేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

